క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్‌లో జరుగుతున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం ఆర్డీవో వినోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లోని విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణంలో..



పాఠశాల వద్ద డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కోరుట్ల: పట్టణంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాలను కూడా డీఎస్పీ పరిశీలించారు. పరీక్షా కేంద్రాలను పకడ్బందీగా పర్యవేక్షించాలని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సతీశ్‌కుమార్‌కు సూచించారు. మండలంలోని ఐలాపూర్, మాదాపూర్ పరీక్షా కేంద్రాలను కూడా పరిశీలించాలని వారు పేర్కొన్నారు.

మోడీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



సభకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

జగిత్యాలటౌన్: హైదరాబాద్‌లో శనివారం జరిగిన ప్రధాని నరేంద్రమోడీ సభకు జగిత్యాలకు చెందిన బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. జగిత్యాల నియోజకవర్గంలోని పలు గ్రామాలతో పట్టణానికి చెందిన పార్టీ శ్రేణులు శనివారం ఉదయం సభకు తరలివెళ్లారు.

కొమొరెడ్డి రామ్‌లు మరణం బాధాకరం



నివాళి అర్పిస్తున్న వాకిటి సత్యంరెడ్డి, రామ్‌లు అభిమానులు

మల్లాపూర్: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు మరణం బాధాకరమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి మండలంలోని ముత్యంపేటలో మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రామ్‌లు అభిమానులతో కలిసి సత్యంరెడ్డి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లోనే ముక్కుసూటితత్వం గల నాయకుడు కొమొరెడ్డి రామ్‌లు అని కొనియాడారు. ఎమ్మెల్యేగా రామ్‌లు చేసిన అభివృద్ధి పనులు మరువలేనివని, నిరుపేద, బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిషలు కొట్లాడిన నాయకుడు అని అన్నారు. పాతదాంరాజుపల్లిలో రామ్‌లు చిత్రపటానికి నివాళి అర్పించారు.

రంజాన్ కానుక కిట్ల పంపిణీ



కానుకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: రంజాన్ పండుగను ముస్లింలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి అన్నారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలోని మసీదులో మండలంలోని 250 మంది ముస్లింలకు ప్రభుత్వం అందచేసిన కానుక కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ నేమూరి లత, ఎంపీడీవో ప్రభు, మండలకోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీ తిమ్మణి రాములు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, నాయకులు నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్‌రావు, నరేశ్, ముస్లిం నాయకులు వాహబ్‌ఖాన్, ఇస్మాయిల్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. ఆర్ట్ ఫొటోగ్రఫీ!

- సహజ ఫొటోలు తీయడంలో దిట్ట వినోద్
- ఆకట్టుకుంటున్న దృశ్యాలు
- అనేక అవార్డులు ఆయన సొంతం



అవార్డు అందుకుంటున్న వినోద్

కోరుట్ల: ప్రకృతి సిద్ధమైన దృశ్యాలు.. సహజ సిద్ధమైన జీవనం విధానం సాగించే పల్లెవాసుల జీవనశైలిని కళ్లకు కట్టే రీతిలో అద్భుతమైన ఫొటోలు తీస్తూ 20ఏళ్లుగా ఫొటోగ్రఫీలో రాణిస్తున్నారు కోరుట్లకు చెందిన చలిగంటి వినోద్. చిన్ననాటి నుంచే ఫొటోగ్రఫీపై మక్కువతో ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ బండి రాజన్‌బాబు స్ఫూర్తిగా తీసుకుని ఫొటోగ్రఫీపై దృష్టిపెట్టారు. ఏళ్ల తరబడి శ్రమించి వివిధ ప్రాంతాల్లోని ప్రకృతి సిద్ధమైన దృశ్యాలను కెమెరాలో బంధించి మన కళ్ల ముందు ఉంచడంలో సిద్ధహస్తుడనే పేరు గడించారు.

ప్రకృతి.. సహజ జీవనశైలి

- ఫొటోగ్రఫీకి సహజ సిద్ధమైన ప్రకృతి.. ఆ ప్రకృతిలో కలిసి జీవించే జనం సంప్రదాయాలను మించిన ఫొటోలు ఎక్కడా దొరకవు అంటారు వినోద్. కశ్మీర్, అరకు, వైజాగ్, గోవా, ఢిల్లీ, హైదరాబాద్ తదిదర ప్రాంతాల్లోని వివిధ ప్రకృతి సిద్ధమైన లొకేషన్లలో ఫొటోలు తీసి అందరినీ ఆకట్టుకున్నారు వినోద్. కేవలం ప్రకృతిలో ఇమిడిపోయిన అందమైన దృశ్యాలనే కాకుండా పల్లె, తండావాసుల జీవనశైలిని ప్రతిబింబించే ఫొటోలు అనేకం తీసిన వినోద్ లెక్కలేని అవార్డులను అందుకున్నారు. ఫొటోగ్రఫీనే వృత్తిగా స్వీకరించిన వినోద్ 'మంచి ఫొటోలు తీయడంలో ఉన్న సంతృప్తి ఎన్ని అవార్డులు వచ్చినా ఉండదు' అని అంటాడు.



లెక్కలేని అవార్డులు.. ఫొటోగ్రఫీలో ఉన్నత స్థాయి అవార్డులు ఎన్నో అందుకున్న చలిగంటి వినోద్‌కుమార్ ఇప్పటికీ తన కళకు పదును పెడుతూనే ఉన్నాడు.





పల్లె జీవనశైలి.. ప్రకృతి అందాలు వెలికితీయాలి



పల్లె జీవనశైలిలో దాగిఉన్న ఎన్నో అద్భుతమైన దృశ్యాలను కెమెరాలో బంధించి పోటోలుగా తీయాలన్న తపన జీవితాంతం కొనసాగుతోంది. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పండుగలు, పబ్బాలు, వేడుకలు జరుపుకునే సమయంలో వేషధారణ విన్యాసాలు.. సంస్కృతి.. సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేయాల్సి ఉంది.

– చలిగంటి వినోద్‌కుమార్, ఫొటోగ్రాఫర్, కోరుట్ల

- 2021లో గోవాలో నిర్వహించిన 53వ నేషనల్ ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో ప్రోటరేచర్ విభాగంలో మొదటి బహుమతి అందుకున్నాడు.
- 2022లో అరకులో సిగ్మా ఫొటోగ్రఫీ అధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ట్రిప్స్ విభాగంలో మొదటి బహుమతి సాధించి గోల్డ్‌మెడల్ అందుకున్నాడు.
- 2022లో సాలార్‌జంగ్ మ్యూజియం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో సంస్కృతి సంప్రదాయాల విభాగంలో రాష్ట్రస్థాయిలో జగిత్యాల జిల్లా పెద్దాపూర్ బోనాల ఫొటోకు రెండో బహుమతి పొందాడు.
- 2002 డిసెంబర్‌లో అరకులో నిర్వహించిన ట్రైబస్ ఫొటో కాంపిటీషన్ పోటీల్లో మొదటి బహుమతి వచ్చింది. ఇలా లెక్కలేని సందర్భాల్లో విభిన్నమైన ఫొటోలు తీసి అనేక అవార్డులు పొందాడు.



ప్రజా సమస్యల పరిష్కారానికే 'పల్లెనిద్ర'

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



లక్ష్మీపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై పల్లెనిద్రలో తెలుసుకొంటున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. 'మీరు నేను' కార్యక్రమంలో భాగంగా జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించడంతో పాటు అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 40ఏళ్లలో ఎప్పుడూ లేనివిధంగా బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి కాలనీకి కాలినడకన తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, నాయకులు బాలముకుందం, సత్యంరెడ్డి, చంద్రారెడ్డి, గంగన్న పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జగిత్యాలరూరల్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం రాత్రి జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మసీదులు, షాదీఖానాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం మైనార్టీ పాఠశాలలను నెలకొల్పినట్లు తెలిపారు. రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, రైతుబంధు కన్వీనర్ రవీందర్‌రెడ్డి, నాయకులు గంగాధర్, బాలముకుందం, చంద్రారెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా కల్వర్టు గోడ

కోరుట్లరూరల్: పట్టణ శివారు నుంచి వెళ్తున్న డి-40 కెనాల్ 64వ నెంబర్ జాతీయ రహదారి వద్ద కల్వర్టు గోడ రోడ్డుకు సమాంతరంగా మారింది. కల్వర్టు నిర్మాణ సమయంలో గోడ ఎత్తుగానే నిర్మించినప్పటికీ ప్రస్తుతం రోడ్డు ఎత్తు పెరగడంతో గోడ రోడ్డుకు సమాంతరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే కల్వర్టు గోడ ఎత్తు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : వెంకటేశ్, ఏఈ, ఇరిగేషన్
ఫోన్ నంబర్: 99639 67931

ఉత్సవ కమిటీ కో-కన్వీనర్లుగా నియామకం

కోరుట్ల: జ్యోతిబాపూలే జయంతి జిల్లా ఉత్సవ కమిటీ సభ్యులుగా పట్టణానికి చెందిన ఇద్దరు బీసీ యువజన సంఘం నేతలను కోకన్వీనర్లుగా కలెక్టర్ యాస్మిన్ బాషా నియమించారు. 11న జ్యోతిబాపూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కాగా శనివారం ఉత్సవ కమిటీని కలెక్టర్ నియమించారు. రాష్ట్ర బీసీ యువజన సంఘం కార్యదర్శి శికారి గోపీకృష్ణ, సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్ర ప్రసాద్‌ను ఉత్సవ కమిటీ కోకన్వీనర్లుగా నియమించారు. జిల్లా సంక్షేమ అధికారి సాయిబాబా, రాష్ట్ర బీసీ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, నరేశ్, రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యం



వరిధాన్యం ఆరబెడుతున్న రైతు

కథలాపూర్: మండలంలో యాసంగిలో సాగుచేసిన వరిపంట చేతికి రావడంతో రైతులు కోతలు ప్రారంభించారు. హార్వెస్టర్‌తో వరిపంటను కోయించి వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోస్తున్నారు. మండలంలో వరి కొనుగోలు కేంద్రాలు ఎన్ని నిర్వహిస్తారో ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. రైతులు మాత్రం వరిధాన్యం కుప్పలు పోసి ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా భీమేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్లలోని శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లి రథోత్సవం..
జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామ శివారులోని పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి గ్రామ పొలిమేర వరకు తీసుకెళ్లి పొరండ్ల భీమేశ్వరస్వామి, హన్మాజీపేట పెద్దమ్మ తల్లి రథాలు ఎదురెదురుగా రావడం, గ్రామ పొలిమేరలో ప్రత్యేక పూజలు చేశారు.

నల్లబ్యాడ్జీలతో సీపీఐ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మెట్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ పార్కులో శనివారం సీపీఐ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ మాట్లాడుతూ రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపించారు. అలాగే సింగరేణి గనులను ప్రైవేట్‌కు అప్పగించాలని చెప్పిన మోడీ.. ఇప్పుడు టెండర్లు పిలవడం ఎంతవరకు సమంజసమన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడానికి 14 నుంచి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్, మల్లేశ్, హన్మాండ్లు పాల్గొన్నారు.

మేడిపెల్లిలో..
మేడిపెల్లి: విభజన హామీలు నెరవేర్చకుండా, సింగరేణి బొగ్గు గనులకు టెండర్లు పిలిచిన ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని సీపీఐ మండల కార్యదర్శి మునుగూరి హన్మంతు అన్నారు. రాష్ట్రంలో ప్రధాని పర్యటనను నిరసిస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిలువేరి గంగచారి, దీకొండ గంగాధర్, తాటిపాముల చిన్నయ్య, కొండ రాజయ్య, గంగారాం, మకిలి డానియల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై సీబీఐతో విచారణ చేయాలి



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్: టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీని సీబీఐతో విచారణ జరిపించాలని పీసీసీ డెలిగేట్ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత జీవితాలతో ముడిపడిన ప్రశ్నపత్రాల లీకేజీపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువత కొన్ని నెలలుగా ఉద్యోగ పరీక్షలకు రాత్రింబవళ్లు కష్టపడుతుంటే వరుసగా పోటీ పరీక్షల లీకేజీలతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారని వాపోయారు. అనంతరం మల్లాపూర్‌లో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, ఎంపీటీసీలు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మరిపెల్లి సత్తెమ్మ-మల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిట్టపెల్లి జీవన్‌రెడ్డి, నాయకులు నూతిపెల్లి రాజం, పోతిరి రాము, గాజుల రాజరెడ్డి, ముటపెల్లి లింగారెడ్డి, ఎలాల సోమరెడ్డి, ఎర్ర భూమయ్య, శంకర్‌రెడ్డి, సింగిరెడ్డి అనంత్‌రెడ్డి, ఎలాల లక్ష్మారెడ్డి, నరేశ్, వినయ్‌రెడ్డి, లింగదాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ టెన్త్ విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు
కోరుట్లరూరల్: పట్టణంలో టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శనివారం సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీపతి సాయితేజ, శ్రీపతి హర్షిత్ తదితరులు ఉన్నారు.

✦ హైదరాబాద్ తరలిన బీజేపీ శ్రేణులు
పెగడపల్లి: హైదరాబాద్‌లో బీజేపీ శనివారం నిర్వహించిన ప్రధానమంత్రి మోడీ సభకు పెగడపల్లి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు బీజేపీ మండల అధ్యక్షుడు గంగుల కొముల్లె ఆధ్వర్యంలో 300 మంది తరలివెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

✦ తక్కళ్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి మృతి
మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ముదుగంటి మధుకర్‌రెడ్డి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. గుండెపోటు రావడంతోపాటు, కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తక్కళ్లపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా మధుకర్‌రెడ్డి 2020 ఫిబ్రవరి 20న బాధ్యతలు చేపట్టారు.

కోరుట్ల ట్రస్మా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



సమావేశమైన ట్రస్మా ప్రతినిధులు

కోరుట్ల/కోరుట్లటౌన్: ట్రస్మా పట్టణ అధ్యక్షుడిగా చౌకి రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గౌతమ్ హైస్కూల్‌లో కోరుట్ల పట్టణ ట్రస్మా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.ఏ.గఫార్, నూతన అధ్యక్షుడిగా చౌకి రమేశ, ప్రధాన కారద్యర్శిగా కుడేలు రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా తంగళ్లపల్లి దీపక్, ఉపాధ్యక్షులుగా పిన్నం శెట్టి శ్రీధర్, గుజ్జేటి వెంకటేశ్, ఆర్గనైజర్ సెక్రటరీగా జాప నరేశ్, స్పోర్ట్స్ కార్యదర్శిగా ఎం.ఏ.బారీ, కోర్ కమిటీ ప్రతినిధులుగా తుమ్మనపెల్లి సత్యనారాయణ, బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, బండి మహదేవ్, బాలాజీ దామోదర్‌ను ప్రకటించారు. ట్రస్మా సభ్యులు సిద్ధార్థ, రహీం, మొయిజ్ పాల్గొన్నారు.

'రాళ్లవాగు'కు కొమొరెడ్డి రామ్‌లు పేరు పెట్టాలి

కథలాపూర్: మండలానికి సాగునీరందిస్తున్న రాళ్లవాగు ప్రాజెక్టుకు మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు పేరు పెట్టాలని మండల రైతు నాయకుడు గడ్డం రాజేశ్వర్‌రెడ్డి శనివారం డిమాండ్ చేశారు. 2006 సంవత్సరంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో రాళ్లవాగు ప్రాజెక్టు పనులకు భూమిపూజ చేయించిన ఘనత మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లుకే దక్కిందన్నారు.